క్లుప్తంగా

16న కొల్లూరులో కంటి వైద్య శిబిరం

చింతమోటు(భట్టిప్రోలు): గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ కొల్లూరులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ కైతేపల్లి షాలేమ్‌రాజు మంగళవారం తెలిపారు. కాకతీయ కల్యాణ మండపంలో నిర్వహించనున్న శిబిరంలో వయసుతో నిమిత్తం లేకుండా ప్రముఖ కంటి వైద్య నిపుణులు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయించనున్నట్లు తెలిపారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి ఉచితంగా కళ్లజోళ్లు ఉచితంగా అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని వేమూరు నియోజకవర్గ వాసులు వినియోగించుకోవాలని కోరారు. కంటి పరీక్షలకు వచ్చేటప్పుడు ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు యన్నం సురేష్, కె.సుబ్బారావు, వై.దాసు, కె.మాణిక్యారావు, ఎ.ఇస్సాకు, క్రాప నాని, సీహెచ్ మోహన్, వి.గురవయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

రేపల్లె రూరల్: పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థులకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో అవలంబించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాజడిబోరా, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేశన నాగమల్లేశ్వరరావు, సెక్రటరీ వి.రాఘవేంద్రరావు, సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేత

రేపల్లె: క్రీడలతో శారీరక ఉల్లాసంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని ఎంఈఓ నవీన్‌కుమార్ అన్నారు. భాష్యంలో నిర్వహించే ఇన్‌ట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా పలు ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు స్థానిక భాష్యం పాఠశాలలో మంగళవారం నిర్వహించిన బహుమతుల అందజేత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చదువుతో పాటు వ్యాయామాన్ని కలిగించే ఆటల ఆడేవిధంగా విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. సందర్భంగా పలు ఆటలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

జగనన్న కాలనీ సందర్శించిన పీడీ

వేమూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని బాపట్ల జిల్లా గృహ నిర్మాణం శాఖ ప్రాజెక్ట్ అధికారి ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని జగనన్న కాలనీని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణంపై నిర్లక్ష్యం చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కరెంట్ సమస్యలు విద్యుత్ శాఖ డీఈతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి సజ్జా లక్ష్మీ తిరుపతి శ్రీనివాస్, ఉప సర్పంచి తలతోటి ప్రదీప్, హౌసింగ్ డీఈ రవికుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ సునీత పాల్గొన్నారు.

భారీ వృక్షాలు నరికివేత



కొల్లూరు: చెరువు కట్ట వెంబడి వున్న భారీ వృక్షాలను టీడీపీకి చెందిన సర్పంచి, అనుమతులు లేకుండా నరికివేయించిన ఘటన చోటుచేసుకుంది. కొల్లూరు మండలం తాడిగిరిపాడులో పంచాయతీ చెరువు కట్టల వెంబడి నాలుగు దశాబ్దాలకు పైబడిన చెట్లను ఆ గ్రామ సర్పంచి పోతార్లంక నాగేశ్వరరావు కనుసన్నల్లో అతడి కుమారుడు నరికి సొమ్ము చేసుకుంటున్నాడు. పంచాయతీ పరిధిలోని చెరువు కట్టల వెంబడి చెట్ల నరికివేతకు పంచాయతీ తీర్మానాలు, డీఎల్‌పీఓ అనుమతులు లేకుండానే చెట్ల నరికి కలపను విక్రయించుకోవడం స్థానికంగా తీవ్ర విమర్శలకు దారి తీస్తుంది. దీనిపై ఈఓపీఆర్డీ రవిని సంప్రదించగా అనుమతులు లేకుండా వృక్షాల నరికివేతపై విచారణ చేపడతామని తెలిపారు.

సైకిల్ వినియోగంతో ఆరోగ్యం పదిలం



చింతాయపాలెంలో సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: ప్రతిరోజూ వ్యాయామం చేయటం వలన ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. చింతాయపాలెం గ్రామంలో మంగళవారం కర్లపాలెం మండల వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎంసీఏ జిల్లా ఉపాధ్యక్షురాలు షైనీ మేఘన, సీహెచ్‌వోలు రాధాప్రశాంతి దీప్తి సౌజన్య, శ్రీకాంత్, పుష్పలత పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం..

రేపల్లె: సైకిలు వినియోగంతో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ విజయసారథి అన్నారు. సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ సైకిలు వాడకంతో అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఇంధన పొదుపుతో పాటు వాతావరణ కాలుష్యం పరిరక్షణ సాధ్యమని చెప్పారు. ప్రతి ఒక్కరికి సైకిలు నడపటంతో వారి శరీరంలో వ్యాయామం జరిగి ఆరోగ్యంగా ఉండటంతో పాటు కొన్ని రుగ్మతల నుంచి రక్షణ పొందవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో సైకిలు ర్యాలీ పురవీధుల్లో నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునరావు, ఎంఈఓ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

భట్టిప్రోలులో..

భట్టిప్రోలు: ఆయుష్మాన్ భారత్ హెల్త్ మేళాలో భాగంగా మంగళవారం భట్టిప్రోలు పీహెచ్‌సీ పరిధిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని సర్పంచి దారా రవి కిరణ్మయి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి ప్రారంభించారు. అద్దేపల్లిలోని సచివాలయం-2 వద్ద నుంచి ప్రారంభమైన ఈ సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమం భట్టిప్రోలు బస్టాండ్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఎ.శ్రీనివాసరావు, సీహెచ్‌ఓ డి.మాతయ్య, ప్రధానోపాధ్యాయులు సి.రామకోటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే కోనేటిపురం, సూరేపల్లి, ఐలవరం, పల్లెకోన గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమాలలో సర్పంచులు మోర్ల వెంకటేశ్వరమ్మ, మోర్ల విజయలక్ష్మి, మాచర్ల కోటేశ్వరరావు, బొల్లెద్దు రాజమ్మ, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, నాయకులు దారా చెన్నయ్య, మోర్ల సత్యనారాయణ, బొల్లెద్దు ప్రతాప్, టి.బాలాజి పాల్గొన్నారు.

దోనేపూడిలో..

వెల్లటూరు(భట్టిప్రోలు): స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని దోనేపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో వైద్య ఆరోగ్య సిబ్బంది కలసి సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యురాలు చావలి రామలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మందా ప్రసాదరావు, ఎంఎల్‌హెచ్‌పీ స్పందన, హెచ్‌ఎం తూనుగుంట్ల వెంకటాచలం పాల్గొన్నారు.

నగరంలో..

నగరం: సైకిల్ ఫర్ హెల్త్ ర్యాలీని డాక్టర్ భవానీశ్రీ ప్రారంభించారు. ధూమపానం, మాదకద్రవ్యాల వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. వీటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే సైకిల్ ర్యాలీ చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎస్ బాబూరావు, సూపర్ వైజర్ త్యాగరాజు, ఎంఎల్‌హెచ్‌పీ రాజేశ్వరి, ఏఎస్‌ఎమ్ విమల పాల్గొన్నారు.

బాపట్లలో..

బాపట్ల: ఆరోగ్యమే మహాభాగ్యమని మున్సిపల్ కమిషనర్ ఏ భానుప్రతాప్ పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ కింద ఆరోగ్యమేళా కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టరు టి.వెంకటేశ్వర్లు, మలేరియా అధికారి రాజకుమార్, సూపర్‌వైజర్ శరత్‌బాబు పాల్గొన్నారు.



రేపల్లెలో సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ పార్థసారథి తదితరులు

వెదుళ్లపల్లి వైద్యశాల పరిధిలో..

వెదుళ్ళపల్లిలో ప్రదర్శనను డాక్టర్ మానసాప్రియదర్శిణి ప్రారంభించారు. సైక్లింగ్ చేయటం వలన క్యాన్సర్ వ్యాధిని అరికట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ పద్మ, ఎంపీహెచ్‌ఓ చంద్రశేఖర్, హెచ్‌వీ మీనాకుమారి పాల్గొన్నారు.

కొల్లూరులో..

కొల్లూరు: క్యాన్సర్ మహమ్మారిని నియంత్రించడానికి నిత్యం సైకిల్ తొక్కడం ఒక ప్రత్యామ్నాయం అని కొల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డి.రవిబాబు అన్నారు. మంగళవారం కొల్లూరులో క్యాన్సర్ మహమ్మారిని అరికట్టడంలో ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొల్లూరు బస్టాండ్ సెంటర్లో మానవ హారం ఏర్పాటు చేశారు.

పది మోడల్ పరీక్ష వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈఓ పులి లాజర్ పక్కన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మనోజ్‌కుమార్

భట్టిప్రోలు: ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్, జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పదో తరగతి మోడల్ పరీక్ష వాల్ పోస్టర్లను భట్టిప్రోలు ఎంఈఓ పులి లాజర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి. మనోజ్‌కుమార్ మాట్లాడుతూ నిత్యం విద్యార్థుల సమస్యలపై పోరాడే ఎస్ఎఫ్ఐ విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు ఈ నెల 16, 17 తేదీల్లో బాపట్ల జిల్లా వ్యాప్తంగా మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కె. లక్ష్మణరావు ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో సీసీఈ విధానంలో ఒక మార్కు ప్రశ్నలతో పరీక్ష పేపరు రూపొందించడం జరిగిందన్నారు. అన్ని సబ్జెక్టులలో మొత్తం 100 మార్కులతో పరీక్ష ఉంటుందని చెప్పారు. పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేందుకు వీలుగా ఈ మోడల్ పేపరు రూపొందించినట్లు వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేష్, తిమోతి పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ బృందాల విచారణ



మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి శోభన్

నగరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ బృందాల విచారణ చేపట్టనున్నట్లు జిల్లా విజిలెన్స్ అధికారి శోభన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, సామాజిక తనిఖీ బృందాల సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ 2021-22లో మండలంలో రూ.6.2 కోట్ల నిధులతో ఉపాధి హామీ పనులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ నిధుల వినియోగం సామాజిక తనిఖీ బృందాలు గ్రామాలలో విచారణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందాలు విచారణ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.రాధారమణ, ఏపీఓలు సత్యకృష్ణ, సురేష్, ఈసీ అరుణ పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్న మోదీ

బాపట్ల అర్బన్: కార్పొరేట్ శక్తులైన అదాని, అంబానీలకు వేల కోట్లు ప్రధాని నరేంద్రమోదీ దోచిపెడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య అన్నారు. ఏఐటీయూసీ విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సుమారు 28 ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం దుర్మార్గమన్నారు. జిల్లా అధ్యక్షుడు షేక్ కరీముల్లా, ప్రధాన కార్యదర్శి బి.శామ్యూల్ మాట్లాడుతూ జిల్లాల్లో నూతన కమిటీలు ప్రతి రంగంలో ఏర్పాటుకు కార్మికులు సన్నద్ధం కావాలన్నారు. కార్మికులందరూ సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంగం బాపట్ల జిల్లా కన్వీనర్ జేబీ శ్రీధర్, జిల్లా కోశాధికారి ఎస్.అంజిరెడ్డి, చీరాల ఏఐటీయూసీ నాయకులు బాసి పిడయ్య, సిహెచ్.ప్రకాష్, రేపల్లె నాయకులు పి.బిక్షాలు పాల్గొన్నారు.

16న విద్యుత్ వినియోగదారుల అదాలత్

బాపట్ల టౌన్: విద్యుత్ సమస్యల పరిష్కారమే వినియోగదారుల అదాలత్ లక్ష్యమని విద్యుత్‌శాఖ డీఈఈ హనుమయ్య తెలిపారు. విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఈనెల 16న ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు పరిషత్ పరిషత్ సమావేశం

చుండూరు(వేమూరు): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుగుణమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాయంత్రం 3 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీపీ జాలాది రూబేను అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి

బాపట్ల: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసిన దామోదరం సంజీవయ్య నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచారని మాల మహానాడు బాపట్ల జిల్లా అధ్యక్షులు శీలం రోజన్‌బాబు పేర్కొన్నారు. సంజీవయ్య జయంతి సందర్భంగా అంబేడ్కర్‌నగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మంగళవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు దగ్గుమల్లి శ్రీకర్, మంచాల ఆనంద్,దోనేపూడి హేమంత్, జాన్‌ప్రసన్న బాబూరావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి మేలు చేసిన ఘనత సీఎం జగన్‌దే

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- చింతాయపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



చింతాయపాలెంలో మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: రాష్ట్రంలో ప్రతి ఇంటికి మేలు చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మండలంలోని చింతాయపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబానికి అందిన లబ్ధిని వివరించారు. తొలుత గ్రామంలో పునః నిర్మించిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించచారు. అనంతరం సచివాలయం వద్ద ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఘుపతి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తెలుగుదేశం వారికే పథకాలు అందేవని నేడు తమ ప్రభుత్వంలో అర్హులై ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ప్రతి ఇంటికీ మేలు చేకూర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీపీ యారం వనజ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోట వెంకటరమణ, సొసైటీ చైర్మన్ మరకా పెద వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎలీషాబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పందరబోయిన సుబ్బారావు, సర్పంచులు అక్కల శ్రీనివాసరెడ్డి, దబ్బుకూటి ఏడుకొండలు, ఎంపీటీసీ రాతంశెట్టి లక్ష్మణరావు, తాండ్ర సాంబశివరావు, ఆసిఫ్ అలీ, కో ఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్, నాయకులు యల్లావుల ఏడుకొండలు, కాగిత మహేష్, మరకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పిట్టలవానిపాలెం: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని బాపట్ల ఎస్ఈబీ అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. మండలం చందోలులో దాడులు నిర్వహించగా చందోలు గ్రామానికి చెందిన షేక్ ఆకిల్ అహ్మద్ వద్ద డీపీఎల్ కేసును గుర్తించినట్లు తెలిపారు. దీంతో పాటు అతను వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికులను స్మరించుకోవాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు

బాపట్ల టౌన్: దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికులను స్మరించుకోవాలని సైనిక సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు పేర్కొన్నారు. పుల్వామ దాడిలో మృతి చెందిన జవానుల ఫోటోలతో కూడిన బ్యానర్‌తో పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ భారతదేశ సైనికుల త్యాగాలను యువతరం గుర్తు చేసుకోవాలన్నారు. భారతీయులు అందరూ ఫిబ్రవరి 14వ తేదీని బ్లాక్ డే గా గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రెటరీ తోట దుర్గా రావు, సీనియర్ మాజీ సైనికులు జెట్టి జోసెఫ్ పాల్గొన్నారు.

వీర జవాన్లకు విద్యార్థుల నివాళి

భట్టిప్రోలు: పుల్వామా దాడిలో అమరులైన 40 మంది వీర జవాన్లకు మంగళవారం భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. తొలుత భరతమాత చిత్రపటానికి ఖద్దరు మాలలు వేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సి.రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు శ్రీ సత్యరత్న, బీకే శ్రీనివాసరావు, కె.కోటేశ్వరమ్మ, మురళీధరరావు, వి. సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్టులు అందజేత



ఐలవరం హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనారాయణకు టీషర్టులు అందచేస్తున్న పూర్వ విద్యార్థులు

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ లో జూమ్ క్లాసులకు హాజరవుతున్న విద్యార్థులకు టీషర్టులను పూర్వవిద్యార్థులు అందజేశారు. ఆంగ్లోపాధ్యాయులు హరికృష్ణ గత 6 ఏళ్లుగా ఎన్నో వినూత్న విద్యా, వైజ్ఞానిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హైస్కూల్‌లో 2004-2005 విద్యా సంవత్సరం ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కి చెందిన నల్లూరి శ్రీకాంత్, పాగోలు నాగార్జున, తూశ్లూరి వెంకటేశ్వరరావు మంగళవారం రూ.12 వేలు టీషర్టులను హెచ్‌ఎం లక్ష్మీనారాయణకు అందచేశారు.

వైభవంగా వివాహ దోషనివారణా హోమం



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా మంగళవారం నిర్వహించారు. అనంతరం వివాహ దోష నివారణ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈసందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి, ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ వంశ పారంపర్య అర్చకులు కుంచల బళ్ళారెడ్డి, నరసారెడ్డి పాల్గొన్నారు.

గోరు ముద్ద పథకం పరిశీలన

పిట్టలవానిపాలెం: మండలంలోని పిట్టువారిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సర్పంచి యేట్ర అశ్వినిరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి భోజనం రుచి చూశారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను ఆరా తీశారు. ఆమె వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరిశ నరసింహారెడ్డి ఉన్నారు.